ప్రజాశక్తి

బుధవారం 24 జులై 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

కాస్త కేటాయించినా..!

- అమరావతికి రుణంగా రూ. 5 వేల కోట్లు
- విభజన చట్టం హామీల విస్మరణపై విమర్శలు
- కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు, పెదవి విరుపులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భిన్నాభి ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బడ్జెట్లో రాజధానికి అధిక ప్రాధాన్యమిచ్చామని కేంద్ర మంత్రి ప్రకటించారు. రాజధానికి రూ.15 వేల కోట్లు ప్రపంచ బ్యాంకు నుంచి అప్పు ఇప్పించేందుకు కేంద్రం చొరవ తీసుకుంటుందని ఆమె తెలిపారు. రాజధాని నిర్మాణంపై పదేళ్లుగా పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు రూ.15 వేల కోట్లు రుణంగా ప్రకటించడంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. రాజధాని నిర్మాణానికి 8 ఏళ్ల క్రితం కేవలం రూ.1500 కోట్లే కేటాయించి తొలి దశలో కేంద్రం చేతులు దులుపుకుంది. గుంటూరు-విజయవాడ నగరాలకు యూజీడి, స్ట్రాం వాటర్ మేనేజ్మెంట్ పథకాలను ప్రకటించి మరో రూ.వెయ్యి కోట్లు కేటాయించింది. ఈ రెండు పథకాలు అసంపూర్తిగానే ఉన్నాయి. రాజధాని నిర్మాణమూ అంతే. ఈ నేపథ్య ంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికార ంలోకి రావడంతో అనివార్యమైన పరిస్థితుల్లో



రాజధానికి రుణం ద్వారా నిధులు ఇప్పించేందుకు ఏట్టకేలకు కేంద్రం ముందుకు వచ్చింది.

రాజధానికి సంబంధించి ఇతర ప్రాంతాతో అనుసంధానం కోసం భారీ రహదారులకు నిధులు కేటాయించాలనే రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్ధనపైనా సానుకూల స్పందన రాలేదు. నూతన రైల్వేలైన్‌ల నిర్మాణం, అమరావతి మెట్రో ప్రాజెక్టు కాగితాలకే పరిమితమైంది. వేతన జీవులకు స్వల్ప ఊరట లభించింది. రూ.3 లక్షల ఆదాయం వరకు ఆదాయ పన్ను మినహాయింపు ఇచ్చారు. నిత్యవసర వస్తువులు ధరల నియంత్రణ, రైతులకు ఉపయోగపడే సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు లేదు. గోదావరి-పెన్నా నదుల అనుసంధానం ప్రాజెక్టు ప్రస్తావనే లేదు. పల్నాడు ప్రాంతానికి సంబంధించి వాటర్ గ్రిడ్డుకు నిధులు కేటాయించాలని చాలా కాలంగా రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థిస్తున్నా పట్టించుకోలేదు.

అమరావతికి మళ్లీ జీవం

టి.శ్రావణ్‌కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షులు, తాడికొండ ఎమ్మెల్యే.



రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ.15 వేల కోట్లు కేటాయించడం ముదావహం. కేంద్రం ప్రకటనతో రాజధాని అమరావతికి మళ్లీ జీవం వచ్చినట్లయింది. చంద్రబాబు సిఎం అయిన తర్వాత అమరావతి మళ్లీ పూర్వ వైభవం వచ్చింది.

కేంద్రం నిర్లక్ష్యం వల్ల అమరావతికి దుస్థితి

షేక్ మస్తాన్‌వలి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు.



రాజధాని నిర్మాణం బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉండగా గత పదేళ్ళుగా పట్టించుకోకపోవడం వల్ల ఈ దుస్థితి ఏర్పడింది. విభజన చట్టంలోని హామీలను పదేళ్లుగా కేంద్రం నిర్లక్ష్యం చేసింది. రాజధాని నిర్మాణాన్ని కేంద్రమే చేపట్టాలని చట్టంలో ఉన్నా ఇప్పటివరకు పట్టించుకోలేదు. విభజన చట్టంలోని హామీల అమలు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా విషయంలో నూ కేంద్రం తన వైఖరి మార్చుకొని ప్రజలకు మేలు చేయాలి.

మాటలు ఘనం.. నిధులు శూన్యం..

పాశం రామారావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి.



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. ప్రభుత్వం ఇప్పటికైనా నిధులు కేటాయింపు కోసం కేంద్రంపై వత్తిడి తేవాలి. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి రాజధాని నిర్మాణం కోసం వివిధ సంస్థల ద్వారా రూ.15 వేల కోట్లు సమకూర్చుతామని చెప్పారు తప్ప కేంద్రం గ్రాంటు విడుదల చేస్తుందని చెప్పలేదు. ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలుకు, పొలవరం నిర్మాణానికి, నిర్వాసితులకు నష్టపరిహారం వంటి అంశాలకు నిధులు కేటాయించకపోవడం రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. పుణ్యక్షేత్రాల అభివృద్ధి పేరుతో అనేక రాష్ట్రాలకు నిధులు కేటాయించినా ఆ జాబితాలో మన రాష్ట్రం లేకపోవడం అన్యాయం. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని కూటమి మద్దతుతో కొనసాగుతున్నా నిధుల కేటాయింపుపై చిన్నచూపు చూపింది. ఈ బడ్జెట్‌ను ప్రజలంతా వ్యతిరేకించాలి.

తిరోగమనం దిశగా బడ్జెట్..

గుంటూరు విజయ్ కుమార్, సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి



అన్ని విధాలుగా ఆర్థిక పురోగతి సాధించేలా ఉండాల్సిన బడ్జెట్ తిరోగమన దిశగా ఉంది.పారిశ్రామిక రంగ అభివృద్ధికి పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన భూములు, మౌలిక వసతులు కల్పనపై కేంద్ర బడ్జెట్ బాధ్యతాయుతంగా లేదు. మధ్యతరగతి ప్రజలకు అధిక మొత్తంలో పన్నులు చెల్లించే ఉద్యోగ వర్గాలకు బడ్జెట్ నిరాశ కలిగించింది. పేదరిక నిర్మూలనపై ప్రస్తావనలేదు. కడప ఉక్కు పరిశ్రమ, విశాఖ ఉక్కు పరిశ్రమ అమ్మకం నిలుపుదల, రైల్వేజోన్, యూనివర్సిటీల స్థాపనకు సంబంధించి ప్రకటనేమీ చేయలేదు. పేదలు, మధ్య తరగతి ప్రజలకు చేసిన మేలేమీ లేదు. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాల ప్రస్తావన కనిపించలేదు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా దీనిపై టిడిపి ఎంపీలు పార్లమెంట్‌లో అడిగి స్పష్టతిచ్చేలా చూడాలన్నారు. రాష్ట్రానికి మరిన్ని నిధుల కోసం కేంద్రంపై వత్తిడి తేవాలి.



రుణప్రణాళికను విడుదల చేస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

రూ.34,730.55 కోట్లతో రుణ ప్రణాళిక

- కౌలు రైతులకు రూ.180 కోట్లు రుణాలు అందించాలని లక్ష్యం
- విడుదల చేసిన గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి - గుంటూరు

వ్యవసాయ రంగం అభివృద్ధికి, యువతను, మహిళలను ఔత్సహిక పారిశ్రామిక వేత్తలుగా ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకర్లు విరివిగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. కలెక్టరేట్‌లోని డీఆర్సీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన బ్యాంకర్ల జిల్లా కాన్సల్టేటీవ్ కమిటీ (డీసీసీ) సమావేశం, జిల్లా స్థాయి రివ్యూ కమిటీ (డీఎల్ఆర్సీ) సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో రూ.34,730.55 కోట్లతో 2024-25 ఆర్థిక సంవత్సరం రుణ ప్రణాళికను కలెక్టర్ విడుదల చేశారు. ప్రాధాన్యత రంగాలైన వ్యవసాయానికి స్వల్పకాలిక రుణాలు, టర్మ్ రుణాలు, మౌలిక సౌకర్యాల కల్పనకు, డ్వాక్రా రుణాలకు, పరిశ్రమలకు సంబంధించి ఎంస్ఎంఇలకు, ఎగుమతులకు రూ.24,501.93 కోట్లు, ప్రాధాన్యత లేని రంగాలకు రూ.10,228.62 కోట్లు రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కౌలు రైతులకు రూ.180 కోట్లు రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రాజధాని ప్రాంతంలో భాగమైనందున నిరుద్యోగ యువతకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు స్థానిక అవసరాలకు అనుగుణంగా పరిశ్రమల ఏర్పాటుకు నైపుణ్యాలపై శిక్షణతో పాటు, ఎంఎస్ఎంఈల స్థాపనకు రుణాలివ్వాలన్నారు. కౌలు రైతులకు లక్ష్యాల మేరకు పంట రుణాలను సత్వరమే మంజూరు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకిగ్ సేవలను మరింతగా మెరుగుపర్చాలని, వీధి ▶ 2లో

రూ.4 లక్షల విత్తనాలు సీజ్



ప్రజాశక్తి-వినుకొండ

మండంలోని పలు విత్తన దుకాణాల్లో అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. సరైన బిల్లులు లేకపోవడం, స్టాక్ రిజిస్టర్‌లో వ్యత్యాసాల కారణంగా రూ.4 లక్షలకుపైగా విత్తనాలను సీజ్ చేశారు. చీకటిగలపాలెంలో మిర్చి నర్సరీ షేడ్ నెట్‌లను పరిశీలించారు. నారు పెంచుకునే రైతుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. దుకాణాల్లో విత్తనాలు కొనే సందర్భంలో రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవడంతోపాటు పంట కాలం పూర్తయ్యే వరకూ వాటిని దాచుకోవాలని చెప్పారు. తనిఖీల్లో వినుకొండ ఎడిఎ బి.రవిబాబు, మండల వ్యవసాయాధికారి కె.అంజిరెడ్డి, జిల్లా కార్యాలయం నుండి ఎడిఎ సిహెచ్ రవికుమార్, కమిషనర్ కార్యాలయం నుండి డిడిఎలు సిహెచ్ శ్రీనివాసరావు, రమణమూర్తి పాల్గొన్నారు.

150 లీటర్ల కలుపు మందు సీజ్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పల్నాడు పార్శిల్ సర్వీసెస్ సెంటర్‌లో వ్యవసాయ ఆధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పత్రాలేమీ లేకుండా లేకుండా హైదరాబాద్ నుండి రవాణా అవుతున్న రూ.24 వేల విలువ కలిగిన 150 లీటర్ల కలుపు మందు (గ్లైసెల్)ను గుర్తించి సీజ్ చేశారు. తనిఖీల్లో వ్యవసాయాధికారి ఓ.సునీల్‌కుమార్, బి.గౌతం ప్రసన్న పాల్గొన్నారు.



ఉపాధ్యాయిని వరలక్ష్మికి డాక్టరేట్



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని నిడమర్రు జెడ్‌పి పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని ఉప్పాల శివలక్ష్మికి తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 'స్టడీ హ్యాబిట్స్, ఎడ్యుకేషనల్ అండ్ ఒకేషనల్ ఇంట్రెస్ట్ ఆఫ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్' అంశంపై ఆమె చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. గైడ్‌గా ప్రొఫెసర్ పి.రేణుక వ్యవహరించారు.



ఆర్టీసీ డిపో మార్గంలో లైట్లను వెలిగించరూ..

ప్రజాశక్తి-మంగళగిరి

స్థానిక ఆర్టీసీ డిపో రోడ్డు నిధి భవన్ వద్ద వీధి లైట్లు వెలగడం లేదు. ఇక్కడ ఐటీ కంపెనీలో పనిచేసే ఉద్యోగులతో పాటు స్థానికంగా నివసించే ప్రజలు రాత్రుళ్ల ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సత్వరం స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఇవిఎం గోడౌన్లు తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను, ఫిరంగిపురం మండలం రేపూడిలో వ్యవసాయ మార్కెట్‌లో వివి ప్యాట్స్ భద్రపరిచిన గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. సిసిటివి పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. గోడౌన్ భద్రతా సిబ్బంది లాగ్‌బుక్‌ను పరిశీలించారు. ఇవిఎంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ పి.రోజా, ఆర్‌డిఒ శ్రీఖర్, ఫిరంగిపురం తహశీల్దార్ రాఘవేంద్రరావు, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థానిక వనరులతో మేలైన బోధన, అభ్యసన

ప్రజాశక్తి చేబ్రోలు



స్థానిక కొత్తరెడ్డిపాలెం కొండవీటి కమిటీ ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తాహ్ కార్యక్రమాన్ని అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ విజయలక్ష్మి మంగళవారం సందర్శించారు. ఫౌండేషనల్ లీటరసి అండ్ నంబర్స్ డే కార్యక్రమంలో పాఠ్య పుస్తకాలలోని విషయాలను సులభ పద్ధతిలో బోధించుటకు స్థానిక వనరులతో తక్కువ ఖర్చుతో తయారుచేసిన బోధనోపకరణాలతో గణిత శాస్త్రంలోని వివిధ అంశాలపై కెసి హైస్కూల్ హెచ్‌ఎం శంకర్‌రెడ్డి వివరించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 27 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని మండల విద్యాశాఖ అధికారి ఆర్.సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీయడానికి శిక్ష సప్తాహ్ లాంటి కార్యక్రమాలను ఉపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. బోధనోపకరణాలు ఉపయోగించటం ద్వారా విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తి కలుగుతుందన్నారు.

విద్యుత్ వాహన పరిశ్రమలో భారీగా ఉద్యోగాలు

ఎన్ఐటీ ఏపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీ.సందీప్

ప్రజాశక్తి - గుంటూరు



భవిష్యత్‌లో ఈవీ (ఎలక్ట్రిక్ వెహికల్) ఇండస్ట్రీలో మిలియన్ ఉద్యోగాలు వస్తాయని ఎన్ఐటి ఏపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.సందీప్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలోని ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఏఐసీటీఈ-వాణి (వైబ్రంట్ అడ్వోకసీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ అండ్ నర్చరింగ్ ఆఫ్ ఇండియన్ ల్యాంగ్వేజెస్) ఆర్థిక సహకారంతో 'విద్యుదీకరణ చలనశీలత - ఎలక్ట్రిక్ వాహనాలతో భవిష్యత్‌ను రూపొందించడం' అంశంపై మూడ్రోజుల వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వి.సందీప్ మాట్లాడుతూ భవిష్యత్ అంతా విద్యుత్ వాహనాలదేనన్నారు. రెన్యూవబుల్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వెహికల్స్ రంగాల్లో అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. ఈవీల డిజైనింగ్‌ను ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాలు కలిసి పని చేయాలన్నారు. విద్యుత్ వాహన కొనుగోలుదార్లకు కేంద్ర ప్రభుత్వం రాయితీలిస్తోందని తెలిపారు. ప్రస్తుతం పరిశ్రమలకు ఈవీల్లో వినియోగించే టెక్నాలజీలపైన అనుభవం కలిగిన వారు తక్కువగా ఉండటం ప్రధాన సమస్యగా మారిందని, ఈ సాంకేతికతపై పట్టు సంపాదించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వివరించారు. ఉద్యోగాలకే పరిమితం కాకుండా ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ బ్యాటరీ పనితనం, స్టోరేజ్ గురించి వివరించారు. బ్యాటరీ నుంచి వచ్చేటువంటి వ్యర్థాలను విసర్జించడం ఒక సవాలని, భవిష్యత్తులో హైడ్రోజన్‌తో పనిచేసే వాహనాలు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఈవీల్లో డిజైనింగ్, బ్యాటరీ లైఫ్, తక్కువ బరువుతో మెటీరియల్స్‌ను ఎంచుకోవటం వంటి అంశాలపై విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. రాబోయే 50 ఏళ్లలో విద్యుత్ వాహనాలకు సంబంధించి మరింత సాంకేతికత అందుబాటులోకి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఫణీంద్ర కుమార్, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, రీసెర్చ్ స్కాలర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రజక కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-గుంటూరు



ఎమ్మెల్యే మాధవికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నగరపాలక సంస్థ ద్వారా స్థలం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాదవికి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ పరిధిలో 20 వేల రజక జనాభా ఉన్నారని, వారి కుటుంబాలు వివాహాది శుభకార్యాల నిర్వహణకు ఫంక్షన్ హాల్ లేకపోవటం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రజక కమ్యూనిటీ హాల్ స్థలం కేటాయించే విధంగా కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో హైకోర్టు లాయర్ తుమ్మపూడి శ్రీధర్, అంజయ్య, ఆంధ్రప్రదేశ్ రజకవృత్తిదారుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.వెంకటనరసయ్య, వి.చిన్నకొండయ్య, నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.లంక కైలాసం, పి.రాంబాబు తదితరులున్నారు.

వృద్ధురాలు మృతి.. కళ్లు దానం..



ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

స్థానిక టిడిపి నాయకులు ధూళిపాళ్ల మోహన్‌రావు తల్లి సీతారావమ్మ (90) మంగళవారం ఉదయం మృతి చెందారు. సీతారావమ్మ నేత్రదానం చేయడంతో ఆమె కళ్లను శంకర్ కంటి ఆసుపత్రి సిబ్బంది వచ్చి సేకరించారు. సీతారావమ్మ మతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

రూ.34,730.55 కోట్లతో రుణ ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారులు, చిరు వ్యాపారులు డిజిటల్ పేమెంట్స్ ప్రోత్సహించాలని చెప్పారు. ఆహార శుద్ధి పరిశ్రమలకు పిఎంఎఫ్‌ఎంఇ ద్వారా రుణాలు మంజూరు వేగవంతం చేయ్యాలన్నారు. మంగళగిరి చేనేత క్లస్టర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోని చేనేత పరిశ్రమల్లో కార్మికుల నైపుణ్యాలు మెరుగుపర్చుకోవటానికి, ఆధునిక వస్త్రాల ఉత్పత్తి పరిశ్రమలు ఏర్పాటుకు వీవర్స్ ముద్రా పథకం ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నారు. పీఎంఈజీపీ, విశ్వకర్మ పథకం రుణాలు బ్యాంకుల వారీగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు మంజూరు చేయాలన్నారు. టిడ్కో, హౌసింగ్ రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు, వికలాంగులను వ్యాపారవేత్తలుగా ప్రోత్సహించేందుకు రుణాలు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో డీసీసీ కన్వీనర్ యూనియన్ బ్యాంక్ ఇండియా రీజినల్ హెడ్, డీజీఎం ఎస్.జవహర్, లీడ్ బ్యాంకు మేనేజరు మహిపాల్‌రెడ్డి, ఆర్బీఐ ఎల్డీఓ నవీన్ చిరినెల్లి, నాబార్డు డీడీఎం జి.శరత్ బాబు, కెనర బ్యాంకు ఆర్ఎం రాంమోహన్, ఎస్బీఐ ఆర్ఎం సత్యస్వరూపిణి, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆర్ ఎం.పరిమళ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ పీడీ హరిహరనాథ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీందర్, జౌళి శాఖ ఏడీ వనజ, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



పాస్టర్లకు వస్త్రాలు అందజేస్తున్న అరవపల్లి శ్రీనివాసరావు

అరవపల్లి శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా వెయ్యి మందికి అన్నదానం

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్

టిడిపి ప్రాతూరు గ్రామ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాసరావు పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం సాయంత్రం ప్రాతూరులోని టిడిపి కార్యాలయం ఎదుట 1000 మందికి అన్నదానం చేశారు. పాస్టర్లు, పూజారులకు వస్త్రాలు పంపిణీ శారు. ముందుగా కేక్ కట్ చేసి అరవపల్లి శ్రీనివాసరావుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్య అతిగా పాల్గొన్న టిడిపి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు మాట్లాడుతూ ప్రాతూరులో టిడిపికి మెజార్టీ ఎప్పుడూ లేదని, అయితే శ్రీనివాసరావు తన సేవా కార్యక్రమాలతో 2024 ఎన్నికల్లో మంచి మెజార్టీ వచ్చేల కృషి చేశారని అన్నారు. పేదలకు అండగా ఉండే ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దోప్పలపూడి జ్యోతిబసు, మంగళగిరి నియోజకవర్గ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు జానీఖాన్, టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గుంటూరులోని కొత్తపేట యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా తుమ్మలపాలెం పంచాయతీలో 30 రోజులు పాటు టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. డైరెక్టర్ జి.బ్రహ్మానందకుమార్ మాట్లాడుతూ 30 రోజులపాటు జరిగిన శిక్షణ తరగతులకు హాజరైన ప్రతి మహిళలకు ఉచితంగా కుట్టు సామగ్రి, భోజనం సదుపాయం కల్పించడంతోపాటు అనుభవం గల వారితో శిక్షణిప్పించి మంచి నైపుణ్యాలు నేర్పించామని చెప్పారు. శిక్షణ సద్వినియోగం చేసుకున్న వారికి బ్యాంకు ద్వారా రుణ సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. ఈ ప్రాంతంలో మహిళలను సమీకరించి వారి అభ్యున్నతికి సహకరించిన వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థను అభినందించారు. మాజీ సర్పంచ్ గుంటుపల్లి రాంబాబు, వాటర్ ఎయిడ్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ నర్రావుల సురేష్ పాల్గొన్నారు.



విద్యుత్ వైర్లు తెగిపడి రైతు మృతి

ప్రజాశక్తి-మాచర్ల



పొలంలో పని చేస్తున్న రైతుపై విద్యుత్ వైర్లు పడి ఆయన మృతి చెందిన సంఘటన మండల పరిధి లోని పశువేములలో మంగళవారం జరిగింది. మంగళవారం ఉదయం పశువేముల గ్రామానికి చెందిన దోసపాటి శ్రీహరి (60) తన పొలంలో పని చేస్తుండగా విద్యుత్ వైర్లు ఆకస్మాత్తుగా తెగి మీద పడటంతో రైతు శ్రీహరి అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీహరికి భార్య, నల్గురు పిల్లలు ఉన్నారు. విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

29 మద్యం సీసాలు స్వాధీనం

ఇద్దరు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న ఇరువురు వ్యక్తులనుఅరెస్టు చేసి వారి వద్ద నుండి29 మధ్య సీసాలు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో విజయపురి సౌత్ బార్డర్ చెక్ పోస్ట్ సబ్ ఇన్స్పెక్టర్ రవీంద్ర తెలిపారు.



మంగళవారం ఎస్సై రవీంద్ర విలేకరులతో మాట్లాడుతూ మాచర్లకు చెందిన బద్దెల చిన్నయ్య, వెల్దుర్తి మండలం కండ్లకుంట గ్రామని కి చెందిన నక్క రామయ్య ఇరువురు కలిసి ఏపీ 07డిటి 1512 నెంబర్ గల హీరో స్ప్లెండర్ ప్లస్ వాహనంపై 29 మద్యం సీసాలుతీసుకుని వస్తుండగా ఆంధ్ర -తెలంగాణ బార్డర్ చెక్ పోస్ట్ విజయపురీ సౌత్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఇరువురు వద్ద 29 మద్యం సీసాలు, ద్విచక్ర వాహనం స్వాధీనం చూసుకుని మాచర్ల కోర్టు లో హాజరు పరిచినట్లు ఎస్సై రవీంద్ర తెలిపారు.

వైసిపి నాయకుడిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

ప్రజాశక్తి-పెదకూరపాడు



పెదకూరపాడు మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన వైసిపి పార్టీ నాయకుడు, క్రోసూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి జరిగినట్లు కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి తెలిపారు. అమరావతి మండలంలోని ఉంగుటూరు సమీపంలో ఈ సంఘటన జరిగింది. సాంబిరెడ్డి ప్రయాణిస్తున్న కారును అడ్డగించి పదిమంది కలిసి రాడ్లతో కొట్టినట్టు తెలిపారు. గుంటూరు సాయి భాస్కర్ హాస్పిటల్‌లో ఆయన చికిత్స పొందు తున్నారు.



మాదిపాడు చెక్ పోస్ట్‌ను పరిశీలించిన ఎస్పీ

ప్రజాశక్తి-అచ్చంపేట

పల్నాడు జిల్లా సరిహద్దు అయిన మాదిపాడు చెక్ పోస్ట్ ను పల్నాడు జిల్లా ఎస్పీ కే శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం పరిశీలించారు అనంతరం అచ్చంపేట పోలీస్ స్టేషన్ చేరుకున్నారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లో పరిశీలించే క్రమంలో మంగళవారం సత్తెనపల్లి, నాగిరెడ్డిపాలెం, క్రోసూరు, అచ్చంపేట పోలీస్‌స్టేషన్లను పరిశీలించినట్లు చెప్పారు. జిల్లా సరిహద్దులో సిసి కెమెరాలు పనితీరు, పధాన రహదారులలో సీసీ కెమెరాలు సిబ్బంది పనితీరు గురించి తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఫిర్యాదుల తీసుకునే సిబ్బంది అప్రమత్తంగా ఉండాల న్నారు.

సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో తనిఖీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ ను పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరాల అదుపునకు చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. స్టేషన్ లో పలు విభాగాలను పరిశీలించారు. కేసుల పురోగతి గురించి తెలుసుకున్నారు. క్రైమ్ రికార్డులను తనిఖీ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిఎస్పీ జి.గుర్నాద్ బాబు ను ఆదేశించారు. రాత్రి వేళల్లో పోలీస్ గస్తీన ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణ సిఐ శ్రీనివాసరావు ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.





జపాన్ రాయబారి సుజుకి హీరోషితో ఎంపి లావు శ్రీకష్ణ దేవరాయలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారతదేశంలో జపాన్ రాయబారి సుజుకి హిరోషిని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకష్ణ దేవరాయలు మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్రం ఆంధ్ర రాష్ట్రానికి బడ్జెట్ లో కేటాయించిన నిధులు, ఇంకా ఆంధ్ర ప్రదేశ్ లో పెట్టుబడి అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యతలు, ఉపాధి కల్పనకు సంబంధించిన అంశాలపై చర్చించారని పార్లమెంట్ కార్యాలయం నుండి తెలిపారు.



మిర్చి నిల్వలు		
		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	54,687
మిర్చి ఎగుమతి	:	56,693
మిర్చి నిల్వ	:	14,534
మిర్చి ధరలు		
		రూపాయలలో
334		8,500 - 17,500
నెం.5		9,000 - 11,000
273		11,000 - 13,000
341		8,500 - 16,000
	నాన్ ఎసి	
తేజ		7,500 - 18,000
బడిగి		8,500 - 17,000
దేవనూరు డీలక్స్		10,000 - 15,000
తాలుకాయలు		4,500 - 12,000
	ఎసి	
334		9,000 -15,500
నెం.5		10,000 -10,500
273		12,500 - 12,500
341		8,500 - 15,000
తేజ		9,300 - 18,200
బడిగి		9,000 - 12,700
దేవనూరు డీలక్స్		8,000 - 10,000
తాలుకాయలు		5,000 - 11,200



పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి- క్రోసూరు

కార్యక్రమం రెంటపాళ్ళ బి ఎం సి పరిధిలో డి కోటిరెడ్డి ఆధ్వర్యంలో పీసపాడు గ్రామంలో పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ చేశారు. 54 మంది పాల ఉత్పత్తిదారులకు రెండు లక్షల 52 వేల 85 రూపాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంసీ ఇంచార్జ్ ఈ గోపి రూట్ సూపర్వైజర్ కే నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జనన,మరణ ధ్రువీకరణ పత్రాల కోసం ఎదురుచూపు!

- రోజులు గడుస్తున్నా ఇవ్వని వైనం
- లబోదిబో మంటున్న అర్జీ దారులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ముప్పై ఆరు రోజులు అయిన జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని నమోదు చేసుకున్న వారంటున్నారు. 2016 డిసెంబర్‌కు ముందు యుబిడి (యూనిఫైడ్ జనన మరణ రిజి (స్ట్రేషన్) పద్ధతిలో రిజిస్ట్రేషన్లు చేసేవారు. ఆవిధంగా రిజిస్ట్రేషన్ చేసిన వాటి కోసం వంద రూపాయల చలానా కట్టి మున్సిపల్ కార్యా లయంలో లేదా మీ సేవలో కానీ తీసుకునే వారు. అయితే, 2017 జనవరి 1 నుంచి దేశ వ్యాప్తంగా ఒకే రిజిస్ట్రేషన్‌లో భాగంగా సిఆర్ఎస్ (సివిల్ రి జిస్ట్రేషన్ సిస్టం) పద్ధతిలో నమోదు చేసుకున్న వారికి ఆయా ధ్రువీకరణపత్రాలను ప్రస్తుతం ఇస్తున్నారు. కానీ, ఎవరైతే ఆయా ధ్రువీకరణ పత్రాల కోసం 2017 కు ముందు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారో వారికి మాత్రం ఈ ఏడాది జూన్ 14వ తేదీ నుంచి ..సుమారు 39 రోజులుగా సంబంధిత సైట్ ఆగిపోయింది. ఆ ధ్రువీకరణ పత్రాల కోసం 2016 డిసెంబర్ 31 లోపు నమోదు చేసు కున్న వారు వాటి కోసం ఆశ వదులు కోవాల్సిందేనా? వాస్తవంగా సంబం ధిత వెబ్‌సైట్‌లో సమస్య ఉందా లేక పాత సిస్టమ్ నుంచి కొత్త సిస్టమ్ సిఆర్ఎస్ లోకి మారుస్తున్నారా? యుబిడి సైట్ వస్తుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. ఈ



విషయమై ఏ అధికారి స్పష్టంగా సమాధానం చెప్పలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. విద్యార్థులకు, ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆయా ధ్రువీకరణ పత్రాల అవసరం ఉండటంతో, ఆ పత్రాలు లేనివారు తాము ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ విషయమై స్పందిం చాలని జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆ సైట్ ఎప్పుడు ఓపెన్ అవుతుందో తెలియదు

జనన,మరణ ధ్రువీకరణ పత్రాల జారీ ప్రధాన అధికారి రమణారావు

ప్రస్తుతం పాత పద్ధతిలో ధ్రువీకరణ పత్రాలు కావాలని అప్లై చేసుకున్న వాళ్ల సంఖ్య సుమారు 130 మంది వరకు ఉన్నారని చిలకలూరిపేట మున్సిపల్ జనన,మరణ ధ్రువీకరణ పత్రాల జారీ ప్రధాన అధికారి రమణారావు తెలిపారు. సంబధిత సైట్ ఓపెన్ కావడం లేదని, ఆ సైట్ ఎప్పుడు ఓపెన్ అవుతుందో తెలియదని స్పష్టం చేశారు.



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-మాచర్ల

వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఓ సరోజినిదేవి సూచించారు. మంగళవారం విజయపురిసౌత్ యందలి సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, వారికి అందించే భోజన వివరాలను ప్రిన్సిపాల్ డి మేరిని అడిగి తెలుసుకోన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనాల అంశంలో రాజీ పడవద్దని, వారికి కాచి వడపోసిన నీటిని అందించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థులకు అందించే మంచినీటిని శాంపిల్స్ తీసి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. అనంతరం కొప్పునూరు హెల్త్ సెంటర్ డాక్టరు ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను ఎంపిడిఓ సందర్శించారు. డాక్టరు ప్రవీణ్ క్యాంప్‌కు వచ్చిన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణి చేశారు. ఎంపిడిఓ వెంట విస్తరణ అధికారి కోటేశ్వరరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చాంగంటివారిపాలెంలో 28న ఉచిత వైద్య శిబిరం

డాక్టర్ నెల్లూరి రమేష్, నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వర్షాకాలంలో డెంగ్యూ, మెదడువాపు, మలేరియా జ్వరం, తదితర వ్యాధులు భయపెడుతుంటాయని కలుషితమైన నీరు, దోమలు, అపరిశుభ్రమైన వాతావరణం వల్ల వ్యాధులు ప్రబలుతాయని ఈ నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ నెల్లూరి రమేష్ అన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు సామాజిక బాధ్యతగా ఈనెల 28న ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలెం గ్రామంలో తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ రమేష్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం సత్తెనపల్లి రోడ్డులో తమ హాస్పిటల్ జనరల్, న్యూరాలజీ, చర్మ సంబంధిత వ్యాధులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ బెల్లం అనూష ఆధ్వర్యంలో చర్మ వ్యాధులకు ఉచిత ఓపిపై విశేష సేవలు అందిస్తున్నట్లు రమేష్ పేర్కొన్నారు. వైద్య శిబిరంలో మెదడు, ఫిట్స్ ,పక్షవాతం, మతిమరుపు, తలనొప్పి, కళ్ళు తిరుగుట, వణుకు, వెన్ను, మెడ నొప్పి, చేతులు కాళ్ళ తిమ్మిర్లు, మంట, నరాలు ,కండరాల సమస్యలు తోపాటు సాధారణ వ్యాధులైన బిపి, షుగర్ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఉచి తంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని చాగంటివారిపాలెం పరిసర గ్రామాల ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తాజా ఆహారం తీసుకోవాలని, ఆకు కూరలకు ప్రాధాన్యత ఇవ్వాలని, చేతుల శుభ్రత, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. దోమ తెరలు వాడి దోమ కాటుకు గురి కాకుండా ఉండాలని దోమలు ఇంట్లోకి రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవడం వంటి చిన్నపాటి జాగ్రత్తలు తీసు కుంటే ఆరోగ్యంగా ఉండవచ్చున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని గుర్తు చేసేందుకు ఉచిత వైద్య శిబిరం నిర్వహణ అనంతరం పర్యావరణ పరిరక్షణ దష్ట్యా గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేస్తామన్నారు.

ప్రజా రవాణాను పటిష్టం చేస్తాం: ఎమ్మెల్యే అరవిందబాబు

- **మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణం**
- **నరసరావుపేట డిపోకు చెదిన మూడు నూతన ఆర్టీసీ సర్వీసులను ప్రారంభించిన ఎమ్మెల్యే**

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా రవాణా వ్యవస్థను పటిష్టం చేసి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు.నరసరావుపేటలో నూతనంగా సమకూర్చిన మూడు ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన రవానాకు కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు.గతంలో బస్సులు కొనుగోలు మాటే లేకుండా డొక్కు బస్సులతో కాలం నెట్టుకొచ్చారని అన్నారు. ఫలితంగా ఆర్టీసీలో ప్రయాణం అంటే ప్రజలు ముప్పు తిప్పలు పడే పరిస్థితి ఉండేదని,ప్రజల గురించి ఆలోచించే కూటమి కొత్త బస్సులు కల్పించి ప్రజలకు మెరుగైన పాలన అందిస్తుందని చెప్పారు. తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్.ఎం,ఆర్టీసీ డి.ఎం,మండల పార్టీ అధ్యక్షుడు బండరుపల్లి విశ్వేశ్వరరావు, కన్నెదార రాజు, మాబు, బాలు తదితరులు పాల్గొన్నారు.



సాగర్ కుడికాల్వను బాగుచేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

136 కిలోమీటర్ల మేర 11.50 లక్షల ఎకరాలకు సాగు నీరు సరఫరా అయ్యే నాగార్జున సాగర్ కుడి కాలువన బాగు చేసి రైతులకు నీటి పారుదల సమస్య పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే అరవింద బాబు అన్నారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేసే నాగార్జున సాగర్ కుడికాలువ ఆధునికీకరణ చేయడం ద్వారా పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లా రైతులకు సాగు, తాగు నీరు సరఫరా సక్రమంగా అందుతుందన్నారు.2014-19 మధ్య కాలంలో టిడిపి హయాంలో రూ.5 వేల కోట్లతో కాలువ ఆధునికీకరణ పనులు చేశారని 2019-24 మధ్య కాలంలో వైసిపి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, కనీసం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలు ఏస్థాయిలో విధ్వంసానికి గురయ్యాయో,వ్యవసాయం ఎంత నిర్లక్ష్యానికి గురైందో నిదర్శనమన్నారు.కాలువలో పూడిక,తూడు,తుమ్మ చెట్లు పెరిగిపోయి నీరు పారే అవకాశమే లేకుండా పోయిందన్నారు. వ్యవసాయాన్ని బతికించుకోవాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందన్నారు. పోలవరాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ,అందులో కొంత మేరకు సాగర్ కుడికాలువపై పెట్టాలని ఎమ్మెల్యే వివరించారు.

ఉచిత విద్యుత్‌కు మంగళం పాడేందుకే మీటర్లు

జీఓ 22ను తక్షణమే రద్దు చేయాలి : వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నాడు బిజెపి విధానాలకు తలొగ్గిన వైసిపి అధికారంలో ఉండగా వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగింపు ప్రక్రియకు సంబంధించి విడుదల చేసిన జిఓ నెం. 22 తక్షణమే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవిబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం గిట్టుబాటు కాక నానాటికి రైతులు కౌలు రైతులు సాగు చేసేందుకు ముందుకు రావడం లేదని బతుకు దెరువు కోసం ఇతర మార్గాలను ఎంచుకుంటున్నారని ఈ నేపథ్యంలో రైతులను, కౌలు రైతులను ప్రోత్సహించేందుకు పెట్టుబడి సాయం రూ 20 వేలు, ఉచిత పంటల భీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ ప్రారంభమై రైతులు పెట్టుబడికి అప్పులు చేయాల్సిన పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం రూ.20 వేల హామీని, ఉచిత పంటల బీమాను అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయాలలో రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇప్పటికే వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వం గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 450 మండలాల్లో కరువు ఏర్పడితే 120 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించిందని, ఇంతవరకు ఎలాంటి సహాయం అందించలేదన్నారు. ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం కౌలు రైతులకు అందడం లేదని, కౌలు రైతులకు, యజమానులతో సంబంధం లేకుండా గ్రామ సభలు నిర్వహించి అక్కడికక్కడే గుర్తింపు కార్డులు మంజూరు చేసి పంట రుణాలు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఉపాధి కూలీలకు ఏప్రిల్ నెల చివరి వారం నుంచి చేసిన పనులకు ఉపాధి బిల్లులు చెల్లించలేదని పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని రైతులకు పెట్టుబడి సాయం రూ 20 వేలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే జిఓ నెం. 22 రద్దు చేయాలని వ్యవసాయానికి ఉచిత కరెంటు అందించాలని పంటల బీమా సంక్షేమ పథకాలు రైతులందరికీ అందించాలని ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు..

30వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి-అచ్చంపేట



వర్షాలు అధికంగా కొరవడం గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబల కొండ ప్రజలకు అవగాహన కల్పిం చాలంటూ అచ్చంపేట పంచాయతీ కార్యదర్శి ఎవి సుబ్బారావు అన్నారు మంగళవారం అచ్చంపేట పంచాయతీ కార్యాలయంలో అచ్చంపేట ఒకటి రెండు సచివాలయ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఇంటికి వెళ్లి మరుగుదొడ్లు, పారిశుధ్యం, మురుగు నీరు వంటి వాటి గురించి ఈనెల 30వ తేదీ లోపు సర్వే చేయాలన్నారు. స్థానిక ఆశ వర్కర్ల ద్వారా కుటుంబ వారు రోగాల వివరాలు కూడా నమోదు చేయాలని, ఆన్‌లైన్‌లో పొందు పరచడం గురించి అసిస్టెంట్ ఇంజనీర్ జి నీలయ్య వివరంగా తెలిపారు అంతేకాకుండా ఆగస్టు ఒకటో తేదీని సామాజిక పెన్షన్లు పంపిణీ చేయాలని ఎవరికి సెలవులు ఉండమంటూ కార్యదర్శి సుబ్బారావు సిబ్బందికి సూచించారు

ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయొద్దు

ప్రజాశక్తి-మాచర్ల

పట్టణ ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని అర్బన్ సిఐ బ్రహ్మయ్య సూచించారు. పట్టణంలో సిఐ బ్రహ్మయ్య, ఎస్.ఐ అరుణరెడ్డి, సిబ్బందితో కలిసి పుర వీధులలో ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాలమైన రహదారులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు ఎక్కడపడితే అక్కడ తమ వాహనాలను పార్కింగ్ చేయవద్దని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధలను పాటించకపోతే వాహనదారులపై పెనాల్టీలు వేస్తామని హెచ్చరించారు. నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలను అదుపులోకి తీసుకుంటామని అన్నారు. ఇటీవల 13వ బ్లాక్‌లో దొంగతనం జరిగిన ప్రాంతంలో కూడ కవాత్ నిర్వహించారు. శాంతి భద్రతలను కాపాడే అంశంలో పోలీసులకు ప్రజలు ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చి సహకారం అందిం చాలన్నారు.



సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్

ఉమ్మడి గుంటూరు జిల్లా బాలుర, బాలికల జట్లు ఎంపిక

ప్రజాశక్తి- క్రోసూరు



ఆగస్టు 10, 11,12 తేదీలలో వినుకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్టుబాల్ ఛాంపియన్ షిప్ కోసం మంగళవారం స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో ఎంపికలు జరిగాయి. సుమారు 170 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బాలురు, బాలికల జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్లను ఈ సందర్భంగా గుంటూరు జిల్లా సెక్రెటరీ పి. శివ పార్వతి, సెయింట్ ఆన్స్ ఇంగ్లిషు మీడియం స్కూలు ప్రధానోపాధ్యాయులు సిస్టర్ మేరి రజిత, ఆంధ్రప్రదేశ్ ట్రెజరర్ పి. నరసిహారెడ్డి , పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, స్థానిక వ్యాయామ ఉపాధ్యాయుడు మక్కెన వెంకట్రావు క్రీడాకారులను అభినందించారు.

వందశాతం హాజరు ఉండేలా చర్యలు

యూనిఫాం లేని విద్యార్థులను అనుమతించొద్దు : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు వంద శాతం వుండేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎంఈఓలు, డిప్యూటీ ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎడ్యుకేషన్ సర్వేలో వివరాలు నమోదు కానివాటిపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. శాశ్వతంగా వలస వెళ్లినవారు, డబుల్ ఆధార్ ఉన్న వారి వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, విద్యాశాఖ సైట్‌లో అప్డేట్ చేసేలా రాష్ట్రస్థాయి అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని చెప్పారు. విద్యార్థులు ఒక పాఠశాలకు మారిన వెంటనే అక్కడ మ్యాపింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. బడి మానివేసిన పిల్లల తల్లితండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడి వారు తిరిగి బడికి వచ్చేలా చూడాలన్నారు. విద్యార్థులందరు యూనిఫామ్స్ ధరించి రావాలని, టై, షూ, బ్యాగ్‌లు ధరించాలని అన్నారు. వచ్చేనెల 1వ తేది నుండి యూనిఫామ్ లేకుండా విద్యార్థులను పాఠశాలకు అనుమతించొద్దని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు కూడా వంద శాతం హాజరవ్వాలన్నారు. విద్యార్థి స్కూల్‌కి వచ్చిన మొదలు తిరిగి ఇంటికి వెళ్లే వరకూ ఉపాధ్యాయులదే బాధ్యతని, ఎటువంటి సంఘటనలూ జరగకుండా చూడాలని కోరారు. మధ్యాహ్న భోజనం అందించే ఏజెన్సీలు నాణ్యమైన సరుకులు అందించాలని, మెనూ ప్రకారం గుడ్లు, రాగిజావ ఇతర పదార్థాలన్నీ అందించాలని స్పష్టం చేశారు. ఆర్ఒ ప్లాంట్లు పని చేయని చోట క్యాన్ల ద్వారా తాగునీరు అందించాలన్నారు. వర్షాకాలంలో నీరు కలుషితం కాకుండా చూడాలని డెంగీ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా నీరు నిల్వ వుండకుండా చూసుకోవాలన్నారు. ఇటీవల కొన్ని పాఠశాలలను తనిఖీ చేశామని, విద్యార్థులకు బేసిక్స్ కూడా సరిగా లేవని గమనించామని చెప్పారు. ఉపాధ్యాయులు మరింత దృష్టిపెట్టి మంచి విద్యను అందించాలన్నారు. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దష్టి పెట్టి అందరూ ఉత్తీర్ణత సాధించేలా యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేసిన నిధుల వివరాలు ఆన్లైన్‌లో నమోదు చేయాలన్నారు. స్కూళ్ళలో టాయిలెట్స్, తాగునీరు కిచెన్‌షెడ్స్‌పై దృష్టి పెట్టాలని చెప్పారు. డిఇఒ పి.శైలజ మాట్లాడుతూ పిల్లలకు ఇంగ్లీషు చదవడం పూర్తి స్థాయిలో రావట్లేదని అన్నారు. పాఠ్యపుస్తకాలలోని పాఠాలను విద్యార్థులతో చదివించాలన్నారు. కొత్తగా చేరిన విద్యార్థులకు పుస్తకాలను అందించాలన్నారు. హైస్కూల్ పిల్లలు గంజాయి వాడుతున్నట్లు ఫిర్యాదులు వస్తే టీచర్లు నిర్లక్ష్యం వహించకుండా పోలీసులకు తెలియజేసి కౌన్సెలింగ్ ఇప్పించాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీడీ విజయ లక్ష్మీ, డిఈఓ కార్యాలయం ఎడి నిర్మలారాణి, అధికారులు పి.వెంకటేశ్వరరావు, శాంతకుమారి పాల్గొన్నారు.

పిబిఎన్ కాలేజీలో బీకాం- బిఎఫ్ఎస్ఐ నూతన కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి - పొన్నూరు

2024- 25 విద్యా సంవత్సరం నుండి నిడుబ్రోలు పిబిఎన్ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు బీకాం- బిఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్) అనే నూతన కోర్సును జిల్లాలోనే తొలిగా ఈ కోర్సుకు అనుమతి లభించిందని పిబిఎన్ కళాశాల అధ్యక్షులు కెప్టెన్ అంకప్ప చౌదరి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎన్.అన్నారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శివకుమారి మంగళవారం విలేకరులకు తెలిపారు. భారత ప్రభుత్వ నైపుణ్య రంగ సంస్థ, పిబిఎన్ కళాశాల సంయుక్తంగా బీకాం-బిఎఫ్ఎస్ఐ డిగ్రీ కోర్సును ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభించినట్లు చెప్పారు. మూడవ సంవత్సరంలో ఆయా రంగాల్లోని శిక్షణ సంస్థలు బ్యాంకుల్లో శిక్షణ కాలంలో విద్యార్థులకు స్టైఫండ్ సదుపాయము కల్పించినట్లు తెలియజేశారు. ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ కోర్సునకు వర్తిస్తుందని వివరించారు. ఈ కోర్సు పూర్తయిన తర్వాత విద్యార్థులకు కచ్చితమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. పొన్నూరు పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు కళాశాల పని దినాలలో సంప్రదించాలన్నారు.

వర్సిటీ ఓఎస్‌డిగా ప్రొఫెసర్ ఆర్‌విఎస్ఎస్ఎన్ రవికుమార్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఓఎస్‌డిగా ప్రొఫెసర్ ఆర్‌విఎస్ఎస్ఎన్ రవికుమార్ (ఫిజిక్స్) నియమితులయ్యారు. రుసా కో-ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ఎస్.మురళీమోహన్ బాధ్యతలు చేపట్టారు. నియామక పత్రాలను మంగళవారం ఉదయం ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు నుండి అందుకున్నారు. ఇదిలా ఉండగా వివిధ పోస్టులకు ఇప్పటికే నియామక పత్రాలు పొందిన దూర విద్య కేంద్రం డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు (సోషియాలజీ), దూరవిద్యా కేంద్రం పరీక్షలకు కో-ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ డి.రామచంద్రన్ (కెమిస్ట్రీ), సిడిసి డీన్‌గా ప్రొఫెసర్ వి.రవికుమార్ (ఫిజిక్స్) బుధవారం విధుల్లో చేరనున్నారు.

రాజధానికి రూ.15 వేల కోట్లు శుభపరిణామం : కళం రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లి



అమరావతి రాజధాని కోసం కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్లో రూ.15 వేల కోట్లు కేటాయించడం శుభ పరిణామమని తెలుగు రైతు గుంటూరు పార్లమెంటు అధ్యక్షులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పెనుమాకలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్, సిఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం రాజధాని అభివృద్ధిని విస్మరించిందన్నారు. అమరావతి రాజధాని అభివృద్ధి చెందితేనే ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి రాద్ధాంతం చేస్తున్నారని సద్విమర్శలు చేయడం, సూచనలు ఇవ్వడంలో తప్పు లేదని అయితే ఈ తరహాలో విద్వేషాలు రెచ్చగొట్టటం మంచి పద్ధతి కాదని అన్నారు.

కోర్సు పూర్తయినా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు..

జనసేన నాయకుణ్ణి కలిసిన తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థినులు

ప్రజాశక్తి - మంగళగిరి

గత వైసిపి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిందని జనసేన మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సిహెచ్.శ్రీనివాసరావు విమర్శించారు. తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 2020-23లో చదివిన విద్యార్థినులు తమకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని శ్రీనివాసరావు మంగళవారం విన్నవించగా ఆయన స్థానిక జనసేన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపయోగకరంగా ఐఎఎస్, ఐపిఎస్ కోర్స్‌తో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టి చంద్రబాబు ఎంతో మేలు చేశారని అన్నారు. జగన్ పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల రీయింబర్స్‌మెంట్ సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు. విద్యార్థులు మాట్లాడుతూ కోర్సు అయిపోయాక ధ్రువపత్రాలు అడుగుతుంటే ఫీజులు పూర్తిగా చెల్లిస్తేనే ఇస్తామంటున్నారని చెప్పారు. సచివాలయ సిబ్బంది, ఉన్నతాధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమకు న్యాయం జరుగుతుందనే ఆశతో పవన్‌కళ్యాణ్, నారా లోకేష్‌ను ఆశ్రయించినట్లు చెప్పారు. ఈ సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని శ్రీనివాసరావు హామీనిచ్చారు.



విద్యార్థినులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సిహెచ్.శ్రీనివాసరావు

అన్ని గ్రామాలకూ అధునిక టెక్నాలజీతో రోడ్లు

మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు పరిశీలన చేపట్టిన అధికారులు

ప్రజాశక్తి-దుగ్గిరాల

మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో అంతర్గత రహదార్లు, గ్రామాలను అనుసంధానిస్తూ అధునాతన టెక్నాలజీతో రోడ్లు వేయడానికి డిపిఆర్ రూపొందించాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించినట్లు పంచాయతీరాజ్ ఎస్ఇ జి.బ్రహ్మయ్య తెలిపారు. ఈ మేరకు ఇతర అధికారులతో కలిసి మంగళవారం ఆయన మండల కేంద్రం దుగ్గిరాలలోని కచ్చారోడ్లను పరిశీలించా రు. అనంతరం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమ య్యారు. అత్యంత అధునాతనమైన స్యాచురేషన్ పద్ధతి ద్వారా దీర్ఘకాలం పాటు ఉండే రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ పద్ధతి ప్రకారం రోడ్లను వేస్తే 20 ఏళ్ల అనంతరం కూడా సులువుగా మరమ్మతులే చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అధికారులు ప్రభాకర్‌రెడ్డి, నరసింహారావు, ప్రకాష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, టిడిపి నాయకులు జి.వెంకటరావు, జి.శ్రీనివాస్, ఎన్.చిరంజీవి, ఐ.చంటి, ఎం.గాంధీ పాల్గొన్నారు.


దుగ్గిరాలలో రోడ్లను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ అధికారులు



పెట్టుబడి సాయం, కూలి కోసం వినతి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలను సత్వరమే అందించాలని, కౌలురైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ కూలి చెల్లించాలని ఆయా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు మండలంలోని పొనుగుపాడులో గ్రామ సచివాలయ కార్యదర్శికి మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. నాయకులు జి.వెంకటేశ్వరరావు, వై.నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, వి.అశోక్, ఎం.అశోక్, జి.లూర్థు, కె.రాఘవరావు పాల్గొన్నారు.

పట్టణ ప్రణాళిక విభాగం ఎసిపిగా అంజనా జేమ్స్

ప్రజాశక్తి - మంగళగిరి



ఎమ్‌టిఎంసి (మంగళగిరి-తాడేపల్లి నగర పాలకసంస్థ) పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఎసిపి)గా అంజనా జేమ్స్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు బదిలీపై వెళ్లటంతో ఆయన స్థానంలోకి డిటిసిపి హెడ్ ఆఫీస్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అంజనా జేమ్స్ డిప్యూటేషన్‌పై ఇక్కడ నియమించారు. ఆమెకు పట్టణ ప్రణాళిక విభాగం డిసిపి అశోక్ కుమార్, టిపిఒ రమేష్, టిపిఎస్, సచివాలయ టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు శుభాకాంక్షలు తెలిపారు.


పుస్తకాలను అందజేస్తున్న నవ్య, ఉమామహేశ్వర్

గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన వేజళ్ల వెంకట సుబ్బారావు విద్యా ట్రస్టు ఆద్వర్యంలో కూచిపూడి ప్రభుత్వ గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలను సాఫ్ట్వేర్ ఇంజనీర్ వేజళ్ల నవ్య మంగళశారం బహూకరించారు. కార్యక్రమములో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్, కోగంటి హైస్కూలు ప్రధానోపాధ్యాయులు మువ్వా వెంకటేశ్వరరావు పాల్గొని పుస్తక పఠన ఆవశ్యకతను వివరించారు. ఆధునిక విజ్ఞానము పెరిగిన తరువాత గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనము చేసేవారు తగ్గారని, అందరూ సెల్ ఫోన్ల లోనే మునిగి పోతున్నారని అన్నారు. తెలుగు భాష కూడా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి తరాన్ని గ్రంథాలయం వైపు ఆకర్షితులను చేసి మన సాహిత్యం రాబోయే తరాలకు కూడా అందించే ప్రయత్నము చేయాలన్నారు. అందుకోసం ట్రస్టు ద్వారా ప్రతి సంవత్సరం రూ.10 వేల విలువైన పుస్తకాలను పాఠశాల గ్రంతాలయాలకు కాని, స్థానిక ప్రభుత్వ గ్రంతాలయాలకు బహుకరిస్తున్నామని ట్రస్టు నిర్వాహకులు వేజళ్ల ఉమామహేశ్వర్ తెలిపారు. దాతలకు గ్రంథాలయ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



విజయవాడలోని బస్‌భవన్‌లో వినతిపత్రం సమర్పిస్తున్న చిత్రం

గన్నవరం విమానాశ్రయానికి ఆర్టీసీ సర్వీస్ కోసం వినతి

ప్రజాశక్తి- అమరావతి

గుంటూరు నుంచి విజయవాడ మీదుగా గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆర్టీసీ ఏసీ లేదా నాన్ ఏసీ బస్సులను నడపాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఏపీఎస్ఆర్టీసీ అదనపు కమిషనర్ చంద్రశేఖర్‌కు అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు,ఆంధ్రప్రదేశ్ పంచాయతి పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాం జనేయులు మంగళవారం విజయవాడలోని బస్ భవన్ లో కలిసి విజ్ఞప్తి చేశారు. గుంటూరు, మంగళగిరి నుంచి వైకుంఠపురం వేద వ్యాస మహర్షి ఆలయం, తాటికొండ, ఎం డ్రాయి చావపాడు,పెదమద్దూరు మీదుగా ఆర్టీసీ బస్సు నడ పాలని కోరారు. ఈ విషయమై తొలు త ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏపీఎస్ఆర్టీసీ బస్సు భవన్‌లో బ్రహ్మానంద రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.

మాస్టారు వెంకట అప్పారెడ్డి మృతి

ప్రజాశక్తి-పెదకూరపాడు



పెదకూరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో గతంలో ఇంగ్లీష్, సోషల్ స్టడీస్ మాస్టారు గా పనిచేసి అనంతరం ప్రధానోపాధ్యాయుడిగా రిటైర్ అయిన వై. వెంకటప్పారెడ్డి మంగళవారం మృతి చెందినట్లు అరసం రాష్ట్ర నాయకులు కొమ్మాలపాటి శరత్చంద్రజ్యోతి శ్రీ తెలిపారు. అనంతరం శరత్ మాట్లాడారు. విజయవాడ పోరంకిలోని తన పెద్ద కుమార్తె ఇంట్లో ఆయన కన్నుమూశారని అన్నారు.వారు కొంతకాలంగా ప్రోస్టేట్ కేన్సర్ తో బాధపడుతూ మృతి చెందారన్నారు. ఈ నెల 25న ఆయన అంత్యక్రియలు నిర్వ హించన్నున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.



అన్నం వడ్డిస్తు యాగంటి మల్లికార్జునరావు

'అన్నా క్యాంటీన్‌ను విజయవంతంగా నడుపుతున్నారు'

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల పట్టణంలో అన్నా క్యాంటీన్‌ను ఆర్యవైశ్యులు విజయవంతంగా నడుపుతున్నారని వారి సేవలను మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అబి నందించారు. ఈ సందర్భంగా ఆయన భోజనాలను వడ్డించిన అనంతరం మాట్లాడుతూ ఆగస్టు 15 నుండి రాష్ట్రంలో 150 అన్నా క్యాంటీన్స్ ప్రారంభం ఆవుతాయన్నారు. రూ5కే నాణ్యమైన భోజనం, టిఫిన్ ఆకలితో ఉన్నవారికి అన్నా క్యాంటీన్స్ ద్వారా ఆహారం అందుతుందన్నారు. రాష్ట్రంలో త్వరలో మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు విడేల రామక్రిష్ణ, దారువేముల రామక్రిష్ణ, చీదేళ్ళ ఆంజనేయులు, నాయకులు జక్కా నరసింహారావు, పద్మారెడ్డి, భవానిభాయ్, తిక్కా కొండలు, దుర్భాకలు ప్రసాదు, పిన్నంశెట్టి క్రిష్ణ, మేకల సురేంద్ర తదితరులు పాల్గన్నారు.

పత్తి పొలాల్లో శాస్త్రవేత్తల బృందం పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని నరసరావుపేట మండలంలోని కేతిముక్కల అగ్రహారం, నాదెండ్ల మండలం చిరుమామిళ్ల, సొలస, లింగారావు పాలెం తదితర గ్రామాలలో అధిక వర్షాలకు గురైన పత్తి పొలాలను గుంటూరు జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. నగేష్, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్. వెంకటలక్ష్మి (అగ్రానమీ), డాక్టర్ వెంకట రాములు,డిడిఏ డి.ఆర్.సి పల్నాడు జిల్లా ఎం. శివకుమారి, నరసరావుపేట ఏడిఏ పి.మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారులు వి.నరేంద్ర బాబు , ఏ. హరిప్రసాద్, సరిత గ్రామ వ్యవ సాయ సహాయకులు సందర్శించి తగు నివారణ చర్యలు సూచించారు.



నివారణ చర్యలు

- పొలంలో నిలిచిన నీటిని కాలువలు చేసి తీసివేయాలి.

- 1 శాతం కె.ఎన్.ఓ 3, పొటాషియం నైట్రేట్ (అనగా 250 గ్రాములు 22 లీటర్లు తైవాన్ స్ప్రేయర్ కు) వారం రోజుల వ్యవధిలో పత్తి పంట పై పిచికారి చేయాలి.

- కొంచెం తేమ ఆరిన తర్వాత ఒక ఎకరాకు 50 కిలోల డి.ఏ.పి , 50 కిలోల యూరియా మరియు 25 కిలోల న్యూ రేట్ ఆఫ్ పొటాష్ ను పొలంలో వేద పెట్టుకోవాలి లేదా మొక్కల దగ్గర పాదులు తీసి వేసుకోవాలి.

- రసం పీల్చే పురుగులు పచ్చ దోమ పేనుబంక ల నివారణకు కాండానికి మందు పూసే పద్ధతిలో మోనోక్రోటోఫాస్ 100 మిల్లీ లీటర్ల మందును 400 మిల్లీ లీటర్ల నీటిలో కలిపిన మందు ద్రావణాన్ని పత్తి మొక్కల కాండం మధ్యభాగం లో బొట్టు పెట్టుకుంటూ పోవాలి. ఈ పద్ధతిని పత్తి నాటిన 30 రోజులకు, 45 రోజులకు, 60 రోజులకు పాటించాలి.

- కాండానికి మందు పూసే పద్ధతి పాటించనిచో, ఆకులకు 2 పచ్చపురుగులు దాటిన యెడల రీజెంట్ 2 మిల్లీలీటరు లేదా ఉలాల 0.3 గ్రాములు లీటరు నీటికి కలుపుకొని ఉధతిని బట్టి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలి.

- తేమ ఆరిన తరువాత గొర్రులు గుంటకలు నడుపుకొని కలుపు యాజమాన్యం చేసుకోవాలన్నారు.



నాగిరెడ్డిపాలెంలో ప్రత్తి పొలాన్ని పరిశీలిస్తున్న డి.కృష్ణయ్య

పత్తిలో రసం పీల్చే పురుగులు

ప్రజాశక్తి -బెల్లంకొండ

మండలంలోని నాగిరెడ్డిపాలెంలో మండల వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య రైతు సేవా కేంద్రం సిబ్బందితో కలసి ప్రత్తి పంట పొలా లను సందర్శించి ప్రత్తి లో రసం పీల్చే పురుగులు పచ్చ దోమ ,తామర పురుగులు అక్కడక్కడ ఆశించి నట్లు గుర్తించారు. పచ్చ దోమ ప్రత్తి ఆకు అడుగు భాగంలో రసం పీల్చు ట వలన ఆకులు క్రిందకు ముడుచుకొనుట జరుగుతుందని, తామర పురుగు ఆకు అడుగు భాగంలో పత్ర హరిత గోకి తినుట వలన ఆకు పై బాగానికి ముడుచుకొను ను నివారణ కు గాను ప్రత్తి నాటిన 20,40,60 రోజులలో కాండానికి పూత పూయు పద్ధతి లో మోనోక్రోటోఫోస్ : నీరు 1:4 నిస్పతిలో లేదా ఇమిడాక్లోప్రిడ్ :నీరు 1:20 నిస్పత్తి లో కాండానికి పూయుట ద్వారా రసం పీల్చు పురుగులను సమర్ధ వంతం గా నిర్మూలించవచ్చున్నారు. లేదా నీమస్త్రం పిచికారీ చేయుట లేదా ఇమిడాక్లోప్రిడ్ 80 మి. లీ లేదా తయామీతోక్సమ్ 40గ్రాములు ఎకరాకు చొప్పున పై పాటుగా పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది అయ్యప్ప, శ్యాంప్రకాష,గ్రామ రైతులు చంద్రారెడ్డి, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

చినగార్లపాడులో 'పల్లెనిద్ర'

ప్రజాశక్తి -కారంపూడి

పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని చినగార్లపాడు గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ఎస్.ఐ అమిర్ గ్రామస్తులతో సమావేశమయ్యారు. ప్రజలు పోలీసులకు మధ్య సత్సంబంధాలు మెరుగుపడాలనే ఉద్దేశంతోనే ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పల్లెనిద్ర కార్యక్రమన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులకు చెప్పారు. ఈ సందర్భంగా అయన గ్రామస్తులతో ముచ్చటిస్తూ గొడవల వలన జరిగే నష్టాలు, సైబర్ క్రైమ్, చీటింగ్, దొంగతనలు ఇతర నేరాల గురించి



అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో ప్రతిఒక్కరూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా శాంతియుత వాతావరణంలో జీవించాలని, గొడవలు, కొట్లటల వలన ఎన్నో అనర్ధలు జరుగుతాయని వాటి నుండి దూరంగా ఉండి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

యడ్లపాడులో 'ఆధార్' ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి - యడ్లపాడు

కొత్త ఆధార్ నమోదు, పాత ఆధార్ కార్డుల అప్‌డేట్ కోసం ఏర్పాటు చేసే ప్రత్యేక శిబిరాలను యడ్లపాడు మండలం ప్రజలు తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వై .శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆధార్ అప్‌డేట్ ప్రత్యేక శిబిరాల వివరాలను తన కార్యాలయంలో విలేకర్లకు వెల్లడించారు. మండలంలోని జాలాది సచివాలయం పరిధిలో మాత్రమే ఆధార్ సెంటర్ ఉన్నందున 23, 24, 25 తేదీల్లో జాలాది గ్రామంలోనూ, 26, 27వ తేదీల్లో జగ్గాపురం గ్రామంలో ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని వివరించారు. 23వ తేదీన జాలాది గ్రామ సచివాలయం, 24న జాలాదిలోని మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల, 25న జాలాది అంగన్‌వాడీ కేంద్రం, 26న జగ్గాపురం జిల్లా పరిషత్ హైస్కూల్, 27న జగ్గాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ ప్రత్యేక శిబిరాలు అందుబాటులో ఉంటా యన్నారు. నూతనంగా 0-5 సంవత్సరాల పిల్లలకు ఆధార్ కార్డు నమోదు, అప్‌డేట్ ప్రక్రియ, పెద్దలకు ఆధార్ కార్డులో చిరునామా, ఫోటో మార్పు చేయుట, వేలిముద్రలు, మొబైల్ నంబర్ వంటి సవరణలు చేసుకోవచ్చున్నారు. యడ్లపాడు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ అవ కాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



జగన్ సొంత ప్రయోజనాల కోసమే ఢిల్లీ ధర్నా

కాంగ్రెస్ ఇన్‌ఛార్జి యరమల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-మాచర్ల

ఎపిలో ప్రభుత్వం ఏర్పడిన అనతికాలంలోనే శాంతి భద్రతల పేరిట ఢిల్లీలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆ పార్టీ నాయకులు ఆందోళన చేస్తామనటం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ డాక్టరు యరమల రామ చంద్రారెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలో ఉండగా ఏ రోజున ఢిల్లీ వెళ్ళి పోలవరం, రాజధాని తదితర రాష్ట్ర ప్రయో జనాల కోసం జగన్ ఆందోళన చేయలేదని నిలదీశారు. జగన్‌మోహన్‌రెడ్డి తన సొంత ప్రయోజనాల కోసమే ఢిల్లీలో ఆందోళన అని విమర్శించారు. అధికారం ఉన్న ఐదేళ్లు వారు చేసిన ఆరాచకాలు, అవినీతి నుండి ప్రజల దృష్టిని మరలించేందుకే అని అన్నారు. రాబోయే రోజులలో కోర్టులు, పోలీసు విచారణల నుండి తప్పించుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలలో భాగంగానే ఇటువంటి ఆందోళనలని అన్నారు.

రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చేందుకే ఢిల్లీ నాటకం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రజా సమస్యలను పరిష్కరించే వేదిక అసెంబ్లీకు హాజరు కాకుండా వైసిపి అధినేత జగన్,ఆ పార్టీ ప్రజా ప్రతి నిధులు కొత్తగా ఢిల్లీ డ్రామాలు మొదలు పెట్టారని జనసేన పార్టీ సెంట్రెల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజీ విమర్శించారు. మంగళవారం స్థానికంగా తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

అవాకులుచెవాకులు పేలినవారికి

బడ్జెట్ కేటాయింపులే సమాధానం

- చంద్రబాబుకు జగన్‌కు తేడాను చాటి చెప్పిన బడ్జెట్
- కేటాయింపుల్లో ఏపీకి ప్రాధాన్యంపై ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హర్షం

ప్రజాశక్తి- వినుకొండ

ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి మధ్య తేడా ఏంటో కేంద్ర బడ్జెట్ కేటాయింపులు స్పష్టంగా చాటి చెప్పాయన్నారు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. సమర్ధుడి చేతుల్లో రాష్ట్రం ఉంటే ఎలా ఉంటుంది? జగన్ లాంటి అసమర్ధుల వల్ల ఎంత నష్టం, కష్టమో కూడా బడ్జెట్ చెప్పిందన్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్డీయేలో చేరడంపై అవాకులు, చవాకులు పేలిన వారికి ఈ కేటాయింపులు చెంపపెట్టులాంటి సమాధానం ఇచ్చాయని తెలిపారు. జీవీ ఆంజనేయులు. కేంద్రబడ్జెట్‌లో రాష్ట్ర రాజధాని అమరావతికి రూ. 15 వేల కోట్ల ఆర్థికసాయం ప్రకటన, భవిష్యత్‌లోనూ అవసరం మేర అదనపు నిధులు ఇస్తామన్న హామీపై మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. మోదీ ప్రభుత్వం 3.0 ప్రవేశ పెట్టిన తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌లోనే ఏపీని ప్రత్యేక చూడడం కేంద్రంలో రాష్ట్రానికి పెరిగిన ప్రాధాన్యం, చంద్రబాబు నాయత్వానికి తార్కాణంగా పేర్కొన్నారు. రాష్ట్ర జీవనాడి పోలవరం పూర్తికి అన్నివిధాల సహకరిస్తామనడం ఎంతో విశ్వాసం ఇచ్చిందని, తిరిగి రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయన్న నమ్మకం కలుగుతోందన్నారు. జీవీ ఆంజనేయులు. కేంద్ర బడ్జెట్‌కు ముందు రెండుసార్లు దిల్లీకి ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలు చేయడం, తెలుగుదేశం పార్టీ ఎంపీలకు శాఖల వారీగా దిల్లీలో పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించ డం కూడా కలిసి వచ్చిందన్నారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు వెనకబడిన ప్రాంతాల అభివద్ధి ప్యాకేజీ కింద నిధులు కేటాయించడం, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక కేంద్రాలకు ఆర్థికసాయం ఎంతో ఉపయోగడనున్నాయని తెలిపారు.



మృతుల కుటుంబ సభ్యులతో రాజకుమారి

అమెరికాలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి - తెనాలి

ఇటీవల అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పట్టణానికి చెందిన చెందిన వెటర్నరీ డాక్టర్ జెట్టి హారిక కుటుంబాన్ని, అమెరికాలోనే స్విమ్మింగ్ పూల్‌లో ప్రమాదానికి గురై మృతి చెందిన తాడిబోయిన రవితేజ కుటుంబ సభ్యులను మహిళా కమిషన్ మాజీ చైర్పర్సన్ నన్నపనేని రాజకుమారి, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ స్టేట్ వైస్ చైర్మన్ గుర్రం ద్వారకా శ్రీనివాస్ మంగళవారం పరామర్శించారు. ఇద్దరు విద్యార్థుల మృతికి కళా కారణాలను కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఆశలతో బిడ్డలను ఉన్నత చదువుల కోసం అమెరికా పంపించారని, కానీ ఇలా జరగటం బాధాకరమని అన్నారు. ఆ కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వారి మృతదేహాలను రప్పించే క్రమంలో సిఎం చంద్రబాబునాయుడు సారధ్యంలో మంత్రి నారా లోకేష్, ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సహకరిస్తున్నారని చెప్పారు.

నేతన్న విగ్రహం వద్ద పరిశుభ్రం చేయాలని వినతి

7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవ సభ జయప్రదానికి చేనేత పరిరక్షణ కమిటీ పిలుపు

ప్రజాశక్తి - మంగళగిరి

వచ్చేనెల 7వ తేదీ జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా ఎన్ఆర్ఐ వై జంక్షన్ వద్ద ఉన్న నేతన్న విగ్రహం చుట్టు ఉన్న పరిసర ప్రాంతాన్ని పరిశుభ్రంగా చేయాలని చేనేత పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ కు అలీంబాషాకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతకు ప్రసిద్ధిగాంచిన మంగళగిరి నగరంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేతన సర్కిల్‌కు ప్రభుత్వమే పూర్తిగా మెరుగులు దిద్దాలని ఆ వినతి పత్రంలో కోరారు. కమిషనర్ వినతిపత్రం అందజేసిన వారిలో చేనేత పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎం.సుధాకర్, జి.ధనుంజయ్‌రావు, సహాయ కార్యదర్శులు ఆర్.శిసత్యనారాయణ, పి.బాలకృష్ణ, కమిటీ సభ్యులు ఆర్.పూర్ణచంద్రరావు, కె.కోటేశ్వరరావు, డి.రామారావు, జె.సుబ్బారావు, బి.బాలతోడేరు, కె.వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జాతీయ పదవ చేనేత దినోత్సవాన్ని మంగళగిరి ఎన్ఆర్ఐ వై జంక్షన్ వద్ద గల నేతన్న సర్కిల్ వద్ద 7వ తేదీ ఉదయం 9 గంటలకు నిర్వహించాలని కమిటీ సమావేశం నిర్ణయించింది. ఈ సభలో చేనేత పరిరక్షణ కమిటీ నాయకులు, చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్స్, వస్త్ర విక్రయదారులు పాల్గొనాలని కోరింది.

నేతన్నలకు కేంద్ర బడ్జెట్ లో తీవ్ర అన్యాయం

రూ.48 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్లో 6 కోట్ల జనాభా ఉన్న చేనేత పరిశ్రమకు కేటాయించింది రూ.200 కోట్లు మాత్రమేనని, ఇంతటి దారుణానికి వడికట్టిన కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి, రూ.10వేల కోట్లు కేటాయించాలని మంగళగిరి చేనేత పరిరక్షణ కమిటీ నాయకులు అన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పిఆర్ కమిషనర్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకిరంచిన విఆర్ కృష్ణతేజకు తాడేపల్లిలోని కార్యాలయంలో రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు పాపారావు, పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్, అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మంగళవారం కలిసి సత్కరించారు. త్వరలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌తో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యవర్గసభ్యులు ఎం.చందు వెంకటసాంబశివరావు, సర్పంచులు బి.జానకీదేవి, అశోక్‌కుమార్, ఎన్.లలితకుమార్, నాగమణి, ఎ.సాంబశివరావు, ఎన్.శిరీష సుధాకర్, బుచ్చిబాబు, చంద్రబోస్ పాల్గొన్నారు.





పురస్కార గ్రహీతలుగా ప్రొఫెసర్ వెలుఓలు నాగరాజ్యలక్ష్మి, ఆచంట రజనీకుమారి

నేడు గ్రంథాలయ సేవా పురస్కార సభ

ప్రజాశక్తి - గుంటూరు

గ్రంథాలయ పితామహ అయ్యంకి వెంకట రమణయ్య, గ్రంథాలయ గాంధీ డాక్టర్ వెలగా వెంకటప్పయ్య, గ్రంథాలయ సేవా పురస్కార సభ, డాక్టర్ కౌలా ఎండోమెంట్ ఉపన్యాసం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై బుధవారం సాయంత్రం ఆరున్నర గంటలకు జరుగుతుందని శ్రీ అన్నమయ్య సేవాసమితి అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య మంగళవారం తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, విశిష్ట అతిథిగా ధర్మజ్యోతి శ్రీలంకా సూర్యనారాయణ, పురస్కార ప్రదాతలు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్, డాక్టర్ ఆరేటి కృష్ణకుమారి హాజరవుతారని తెలిపారు. ఆత్మీయ అతిథులుగా ప్రొఫెసర్ అయ్యంకి మురళీకృష్ణ, డాక్టర్ వెలగా నాగార్జున పాల్గొంటారన్నారు. 2024 సంవత్సరానికి పురస్కార గ్రహీతలుగా ప్రొఫెసర్ వెలుఓలు నాగరాజ్యలక్ష్మి, విజ్ఞాన్ విశ్వవిద్యాలయం గ్రంథాలయాధికారి ఆచంట రజనీ కుమారిని ఎంపికచేసినట్లు దేవస్థానం అధ్యక్షులు మస్తానయ్య, ప్రోగ్రాం కన్వీనర్ పావులూరి శ్రీనివాసరావు తెలిపారు.



మున్సిపల్ పాఠశాలలో ఒక క్యాడేట్ - ఒక చెట్టు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మొక్కలను నాటడం ద్వారా దేశ సుస్థిరతను కాపాడొచ్చని కొత్తపేట శ్రీ రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం షేక్ మౌలాబి అన్నారు. 22(ఎ) బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్ ఆదేశాల మేరకు కొత్తపేట బాలుర హైస్కూల్ ఎన్‌సిసి క్యాడెట్లు మంగళవారం వన్ ట్రీ వన్ క్యాడెట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, ఎన్‌సిసి పిఐ సిబ్బందితో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కలను నాటిన వారంతా వాటిని సంరక్షించాలని హెచ్ఎం చెప్పారు. చెట్లు నాటడం ద్వారా పచ్చని ఇళ్లు సృష్టించవచ్చని బెటాలియన్ కమాండింగ్ అధికారి పరిశా సర్దార్ అన్నారు. కార్యక్రమంలో పిఐ స్టాఫ్ సుబేదార్ కిషన్ జ్యోతి, హవాల్దార్ రామ్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంఖ్యాశాస్త్రంలో నైపుణ్యాలపై శిక్షణ

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని బేతపూడి ఎంపిపి పాఠశాలలో శిక్ష సప్తాహ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గణితంలోని సంఖ్యాశాస్త్రం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధిపై శిక్షణిచ్చినట్లు హెచ్ఎం జి.శ్రీనివాస్ కార్తీక్ తెలిపారు.



ఆంధ్రాప్యారిస్ మదుపరులకు వరం



తెనాలి శాఖను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం

- **కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్**
- **డిపాజిట్లపై అత్యధిక వడ్డీ..సీనియర్ సిటిజన్లకు అదనపు ప్రయోజనాలు**

ప్రజాశక్తి-తెనాలి

బ్యాంకింగ్ రంగంలో ఓ నూతన అధ్యాయానికి నాంది పలికింది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్. రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖపట్టణం అక్కయ్యపాలెం ప్రధాన కేంద్రంగా ప్రారంభమైన బ్యాంకు సేవలు గణనీయంగా విస్తరిస్తున్నాయి. తాజాగా ఇప్పుడు ఆంధ్రా ప్యారిస్ ప్రజలకూ బ్యాంకు సేవలు అందుబాటులోకి వచ్చాయి. మధుపరుల పొదుపుకు భరోసా కల్పిస్తున్న బ్యాంక్ 31వ శాఖను తెనాలిలో ఈనెల 21న రామలింగేశ్వరపేటలో ప్రారంభించింది. డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీరేట్లు, వారికి బీమాసౌకర్యం, ఖాతాదారులకు అందిస్తున్న సేవల వివరాలిలా ఉన్నాయి.

స్థానిక రామలింగేశ్వరపేటలో ఏర్పాటు చేసిన బ్యాంకు సేవలు తెనాలి ప్రజలకు ఈనెల 21 నుంచి అందుబాటులోకి వచ్చాయి. బ్యాంకులో అతి తక్కువ వడ్డీకి రుణాలు, డిపాజిట్లపై మెరుగైన వడ్డీ రేట్లు, డిపాజిటర్లకు ఇన్సూరెన్స్ క్రెడిట్ గ్యారంటీ వారి బీమా వర్తింపు, సూపర్ సీనియర్ సిటిజన్లకు, సీనియర్ సిటిజన్లకు, సాధారణ ఖాతాదారులకు వివిధ రకాల వడ్డీ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా అతి తక్కువ ధరకు లాకర్ల సదుపాయం, బంగారంపై ప్రతిరోజూ రుణాలు అందిస్తున్నారు. కారు కొనుగోలుకు రుణాలు, ఇంటి తనఖాపై రుణాలు, వ్యాపార రుణాలు, విదేశీ విద్యకు రుణ సదుపాయం, విదేశీ మారకద్రవ్య సదుపాయం బ్యాంకు ప్రత్యేకతలుగా ఉన్నాయి. ప్రతి సోమవారం నుంచి శనివారం వరకూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం మూడు నుంచి ఆరు గంటల వరకూ బ్యాంకు పని వేళలు. ప్రతి రెండవ, నాల్గవ శనివారాలు సెలవులని బ్యాంకు మేనేజర్ తెలిపారు.

డిపాజిట్లపై వడ్డీ రేట్లు....

ఒక ఏడాది నుండి మూడేళ్ల కాలపరిమితికి సొమ్మును డిపాజిట్ చేస్తే సాధారణంగా 8.10 శాతం, సీనియర్ సిటిజన్లకైతే 8.60, సూపర్ సీనియర్ సిటిజన్లకైతే 9 శాతం వడ్డీ చెల్లిస్తున్నారు. మూడేళ్లకు పైబడి డిపాజిట్ చేస్తే సాధారణంగా 7.50 శాతం, సీనియర్ సిటిజన్లకు 8 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వడ్డీ చెల్లిస్తున్నారు. డిపాజిట్ రెట్టింపునకు సీనియర్ సిటిజన్లకు 106 నెలలు, సాధారణ డిపాజిటర్లకు 112 నెలలుగా నిర్ధారించారు. బంగారు ఆభరణాలపై అతి తక్కువ వడ్డీకి అంటే స్వల్ప వ్యవధికి 8.5 శాతం వడ్డీకి రుణాలిస్తున్నారు.

ఏడాది పొదుపునకు నెలవారి ఆకర్షణీయమైన వడ్డీ..

నెలవారీ ఆకర్షణీయమైన వడ్డీ పొందే పథకాలు బ్యాంకులో ఉన్నాయి. ముఖ్యంగా ఏడాది కాల పరిమితికి రూ.లక్ష డిపాజిట్ చేస్తే సూపర్ సీనియర్ సిటిజన్స్ ప్రతినెలా రూ.744, సీనియర్ సిటిజన్స్ రూ.711, సాధారణ మదుపరులకు రూ.670 చెల్లిస్తున్నారు.

మదుపరులకు ప్రత్యేక డిపాజిట్ పథకం

కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ సీనియర్ సిటిజన్లకు, సాధారణ మదుపరులకు ప్రత్యేక డిపాజిట్ పథకాలను రూపొందించింది. ఆకర్షించే వడ్డీ రేట్లతో రూపొదించిన పథకంలో సీనియర్ సిటిజన్లు నెలకు రూ.1,354 చొప్పున, సాధారణ డిపాజిటర్లు నెలకు రూ.1,372ను 60 నెలలు చెల్లిస్తే రూ.లక్ష పొందే వీలుంది.



విశాఖపట్టణం అక్కయ్యపాలెంలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయ భవనం

బ్యాంకు అందిస్తున్న ఇతర సేవలు

బ్రాంచ్ కార్యాలయంలోనే ఎటిఎం సౌకర్యాన్ని కల్పించారు. దేశంలో అన్ని ప్రాంతాలకు డిమాండ్ డ్రాఫ్ట్ సౌకర్యం, నగదు బదిలీ విషయంలో ఆర్టీజీఎస్, నెఫ్ట్ సదుపాయం, పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు, యుపిఐ పేమెంట్స్ ఫోన్‌పే, గూగుల్‌పే, పేటిఎం సదుపాయం, మొబైల్ బ్యాంకింగ్ అందుబాటులో ఉన్నాయి.

మెరుగైన సేవలందిస్తున్నాం



బ్యాంకింగ్ రంగంలో 25 ఏళ్ల అనుభవంతో డిపాజిటర్లకు, ఖాతాదారులకు మెరుగైన సేవలిందిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికి తెనాలితో కలిపి 31 శాఖలయ్యాయి. భవిష్యత్‌లో ఇంకా విస్తరిస్తాం. ప్రభుత్వ బ్యాంకులకు దీటుగా విదేశీ విద్యారుణం, బంగారు ఆభరణాలపై రుణాలు, గృహ తనఖా రుణాలు, వ్యాపార రుణాలు, మదుపరులకు బ్యాంకు లాకర్లు అందుబాటులో ఉన్నాయి. తెనాలి ప్రాంతంలోనూ బ్యాంకు సేవలకు కచ్చితంగా ఆదరణ లభిస్తుంది.

కొమ్మారెడ్డి రాంబాబు, చైర్మన్.

కేంద్ర బడ్జెట్‌పై పెదవి విరుపులు

ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్

గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి



ఆంధ్రప్రదేశ్‌కు వెన్నుదన్నుగా నిలిచేలా కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి హర్షం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతికి కేంద్రబడ్జెట్‌లో రూ.15 వేలు కోట్లు కేటాయింపు, వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తున్నట్లు కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించారన్నారు. ప్రత్యేక కార్యక్రమాల్లోనూ ఏపీకి ప్రాధాన్యమిస్తామని చెప్పారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఏపీ ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి బడ్జెట్‌లో రూపకల్పన చేశారని, చంద్రబాబు కృషి వల్లే ఇది సాధ్యమైందని అన్నారు.

చేనేతకు మొండిచేయి

చేనేత కార్మిక సంఘం



కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో చేనేతకు మొండి చేయి చూపిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.దుర్గారావు, పి.బాలకృష్ణ విమర్శించారు. వ్యవసాయం తర్వాత చేనేత రంగం ఉంటుందని, అంతటి ప్రాధాన్యం కలిగిన రంగానికి కేవలం రూ.200 కోట్లు కేటాయించటం దారుణమని అన్నారు. కేటాయించిన ఈ నిధులు కూడా అధికారుల జీతభత్యాలకే సరిపోతాయని ఇంకా చేనేతకు మిగిలేది ఏమిటని ప్రశ్నించారు. కనీసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదు

ఎపిజిఇఎ అధ్యక్షులు చాంద్‌బాషా



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ప్రభుత్వ ఉద్యోగులకు ఎటువంటి ప్రయోజనమూ లేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా అన్నారు. ప్రతి బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు ఆదాయపు పన్నులో శాశ్వత మినహాయింపు, ట్యాక్స్ పరిధిని పెంచితే ఉద్యోగులకు, వేతన జీవులకు న్యాయం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల వైద్య సదుపాయాలు ఖర్చును కూడా ఆదాయపన్ను పరిధిలోకి తేవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే క్రమం తప్పకుండా ఆదాయపన్ను చెల్లిస్తున్నారని, రాబోయే సంవత్సరాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు ఆదాయపు పన్ను రూ.8 లక్షల వరకు మినహాయింపు ఇవ్వాలని, ప్రామాణిక తగ్గింపులు రూ.లక్ష వరకు మినహాయింపు ఇవ్వాలని కోరారు.

పదేళ్లుగా మభ్యపెడుతున్నారు

కాంగ్రెస్ పొన్నూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవీంద్రనాథ్



పదేళ్లుగా అంకెల గారడితోనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మభ్యపెడుతోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జె.రవీంద్రనాథ్ విమర్శించారు. 2014 నుండి నేటి వరకు ఇది 11వ బడ్జెట్ అని, అన్ని బడ్జెట్‌లలోనూ ఆంధ్రప్రదేశ్‌కు బిజెపి ఇచ్చింది శూన్యమని అన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రూ.15 లక్షల కోట్లు అవసరం ఉండగా, అది నేడు రూ.20 లక్షల కోట్లకు చేరిందని, కేంద్రం ప్రకటించిన రూ.15 వేల కోట్లు ఏ మూలకు వస్తాయో వారే చెప్పాలని నిలదీశారు. కనీసం ఆంధ్రప్రదేశ్ ఎంపీలతో మూడోసారి అధికారంలోకి వచ్చామన్న కృతజ్ఞతతో బీజేపి వ్యవహరించాలన్నారు. ఇకపై అంకెలతో మభ్యపెట్టకుండా ఈ ఐదేళ్లల్లో ఏడాదికి రూ.2 లక్షల కోట్లు కేటాయించి రాష్ట్రం నిలదొక్కుకోవడానికి ప్రయత్నించాలని, ఇందుకు రాష్ట్రంలోని పార్టీలు ప్రయత్నించాలని కోరారు.

రాష్ట్రానికి మరోసారి అన్యాయం

అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి



యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి, అప్పులు ఊబిలో కూరుకుపోతున్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని తిరిగి గాడిలో పెట్టగల ప్రత్యేక హోదా ప్రకటన ఈ బడ్జెట్‌లో అయినా సాకారం అవుతుందని ఎదురు చూసిన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కేంద్ర బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేకపోవడం తీవ్ర నిరాశకు గురి చేసిందని అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి విమర్శించారు. విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉండగా అరకొరగా, అదీ అప్పు రూపంలో రూ.15 వేలకోట్లు కేటాయించి బడ్జెట్లో చేతులు దులుపుకున్నారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు పునరావాస ఖర్చుకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులపై స్పష్టత లేదని, విభజన కారణంగా దెబ్బతిన్న రాష్ట్రానికి న్యాయం జరగలేదని అన్నారు. ముఖ్యంగా ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్ హక్కు.. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి రాజకీయాలకతీతంగా భరోసా చట్టబద్ధమైన ప్రత్యేక హోదా తోనే సాధ్యమన్నారు. కేంద్రం ఏపీపై ఈ బడ్జెట్‌లోనూ వివక్ష కొనసాగించిందని విమర్శించారు.

విద్యారంగానికి కేటాయింపులు నిరాశాజనకం

యుటిఎఫ్ పల్నాడు జిల్లా కమిటీ



కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు నిరాశజనకంగా ఉన్నాయని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధి పేర్కొన్నారు. కొఠారి కమిషన్ సిఫార్సులు మేరకు జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా 3.5 శాతమే కేటాయించడం విద్యారంగం పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తుందన్నారు. వేతన జీవులు పాత పన్నుల విధానంలో మార్పు ఆశిస్తే కొత్త పన్నుల విధానంలో మార్పులు చేయడం ఏమాత్రం ఉపయోగాలు కాదన్నారు. సిపిఎస్ విధానం గురించి ప్రస్తావించలేదని, పాత పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఈ బడ్జెట్ నిరాశ కలిగించిందని అన్నారు. నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాల కల్పన, శాస్త్ర సాంకేతిక రంగాలపై యువత ఆకర్షించేలా ఆయా రంగాలకు ఎక్కువ బడ్జెట్ కేటాయించాలన్నారు.

24, 25 తేదీల్లో ఆర్‌విఆర్‌లో స్పేస్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-గుంటూరు : ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజీలో బుధ, గురువారాల్లో స్పేస్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్.కె.మద్దినేని తెలిపారు. చంద్రయాన్-3 చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకొని భారత ప్రభుత్వం ఇస్రో, సతీష్ ధావన్ స్పేస్ సెంటర్-షార్ నేతృత్వంలో తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవాలు తమ కళాశాలలో జరుగుతున్నాయని చెప్పారు. ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి షార్ సైంటిస్ట్ అండ్ డైరెక్టర్ ఎ.రాజరాజన్, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామమోహన్‌రావు, షార్ డిప్యూటీ డైరెక్టర్ టి.ఎస్.రఘురాం, ఇస్రో శాస్త్రవేత్తలు పాల్గొంటారని తెలిపారు. ఇస్రో నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిస్సా రాష్ట్రాలలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో నిర్వహించనున్న జాతీయ అంతరిక్ష దినోత్సవాలు అమరావతి రీజియన్ పరిధిలో తమ కళాశాల వేదిక కావటం ఆనందంగా ఉందని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని అంతరిక్ష పరిశోధనా విజ్ఞానం పెంచుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ సూచించారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

30న సంఘం శరణం గచ్ఛామి నృత్య రూపక ప్రదర్శన

ప్రజాశక్తి - చిలకలూరిపేట


డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందరివాడని.. కొందరి వాడు కాదని చాటిచెప్పేందుకు 'సంఘం శరణం గచ్ఛామి' నృత్యరూపకాన్ని ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో 30వ తేదీన పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో ప్రదర్శించనున్నట్లు ప్రజాసంఘాలు ప్రకటించాయి. ఈ మేరకు స్థానిక పండరిపురంలోని ఏలూరి సిద్ధయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజా సంఘాల సమావేశం మంగళవారం నిర్వహించారు. తొలుత కరపత్రాన్ని ఆవిష్కరించగా అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఎస్.లూథర్ మాట్లాడారు. నాటకాన్ని 30వ తేదీన నరసరావుపేటలోని ప్రకాష్‌నగర్‌లో గల భువనచంద్ర టౌన్‌హాలులో సాయంత్రం 6 గంటలకు ప్రదర్శిస్తారని చెప్పారు. కె.దేవేంద్ర రచించిన ఈ నాటికకు శివప్రసాద్ దర్శకత్వం వహిస్తారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఇప్పటికే 600కుపైగా ప్రదర్శనలతో ఈ నాటిక ప్రజాదరణ పొందిందని చెప్పారు. ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు హాజరవుతారని తెలిపారు. ఏపీ గిరిజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీనునాయక్, విసికె పార్టీ నియోజకవర్గ కార్యదర్శి వి.ముత్తయ్య మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అందరికీ సమానత్వంతో అమలు చేస్తున్నారని, అయితే ఆయన విగ్రహాలు మాత్రం దళిత వాడలకే పరిమితం చేశారని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం పెరిగిందని చెప్పారు. ఈ నేపథ్యంలో సంఘం సంఘం శరణం గచ్ఛామి నృత్యరపకాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పి.వెంకటేశ్వర్లు, జె.రాజశేఖర్, బుచ్చిబాబు, టి.ప్రతాప్‌రెడ్డి, షేక్ గౌస్, నాగరాజు పాల్గొన్నారు.

క్వార్జ్ క్రిస్టల్‌ను కొల్లగొడుతున్నారు!

- యథేచ్ఛగా తవ్వేసుకుంటున్న అక్రమార్కులు
- బహిరంగంగా కనిపిస్తున్నా చలనం లేని యంత్రాంగం
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని వైనం







ప్రజాశక్తి-నకరికల్లు

మండలంలోని నరసింగపాడులో పూరిబోడు కొండలో అత్యంత విలువైన క్వార్జ్ క్రిస్టల్ నిక్షిప్తమై ఉంది. దీన్ని గాజు గ్లాసులు, అద్దాల తయారీకి వాడే దీనిపై అధికార పార్టీ నాయకుల కన్ను పడింది. సర్వే నెంబర్ 97లోని 110 ఎకరాల రెవెన్యూ పోరంబోకులో కొంతమంది వ్యక్తులు రాత్రికి రాత్రే క్రిస్టల్ తవ్వకాలు జరిపి చెన్నై, హైదరాబాద్, నెల్లూరు, నుంచి వచ్చే దళారులకు అమ్ముకొని రూ.లక్షలు గడిస్తున్నారు. మేలు రకమైన క్వార్జ్ క్రిస్టల్‌కు బహిరంగ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. సైజులను బట్టి కిలో క్రిస్టల్ రాయి రూ.600 నుంచి రూ.లక్ష వరకు ధర పలుకుతుందని దళారులు చెబుతున్నారు.

ఈనెల 4వ తేదీన తవ్వకాలు జరిపి సుమారు రూ.10-15 లక్షలను దండుకున్నారు. నాలుగు రోజుల నుండి తవ్వకాలు జరుపుతున్నారు. కనీసం ఐదు అడుగులు తవ్వితే ఈ ఖనిజం దొరుకుతుంది. దాన్ని నీటిలో కడికి అమ్ముకుంటున్నారు. ఇందుకుగాను అక్రమార్కులు ప్రత్యేకంగా కూలీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. వారు నియమించుకున్న వారు కాకుండా ఎవరైనా అటుగా వెళ్తే గదమాయించి పంపుతున్నారు. కొన్ని సందర్భాల్లో వారే అధికారులకు ఫోన్ చేసి రివర్స్‌లో ఫిర్యాదులు చేస్తున్నారు. తవ్వకాలపై ఇప్పటికే పోలీసు, రెవెన్యూ, మైనింగ్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలేమీ తీసుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొండ ప్రాంతం మొత్తం గుంతలు బహిరంగంగానే కనిపిస్తున్నా తవ్వకాలను నియంత్రించే పని చేయడం లేదని, పర్యవేక్షణా లేదని విమర్శలు వస్తున్నాయి. గతంలో దాచేపల్లి మండల పరిధిలోని బట్టుపాలెం అటవీ ప్రాంతంలో క్రిస్టల్ తవ్వకాలను కట్టడి చేసినట్టే ఇక్కడా నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.